సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం | 24 | ఆగస్టు | 2023



సిరిసిల్లలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

గర్వంగా.. మురవంగా..

- చంద్రయాన్–3 సక్సెస్‌తో జిల్లాలో సంబరాలు
- ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన విద్యార్థులు
- జయహో భారత్ అంటూ నినాదాలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్/తంగళ్లపల్లి(సిరిసిల్ల): చందమామ రావే..జాబిల్లి రావే.. అని అమ్మ కథలు చెబుతుంటే గోరుముద్దలు తిన్న జ్ఞాపకాలు. వేసవిలో ఆరుబయట మంచంపై పడుకొని చందమామను చూస్తూ కథలు చెప్పుకున్న మధురస్మృతులు అనేకం.. ఇవన్నీ మన చిన్నతనాన్ని గుర్తుచేస్తే.. నేడు చంద్రయాన్–3 సక్సెస్‌తో భారతీయులందరం చందమామను చేరుకున్నాం. చంద్రుని ఉపరితలంపై ఏముందో తెలుసుకునేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు నిర్వహించిన చంద్రయాన్–3 ల్యాండింగ్ దృశ్యాలను జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించారు. జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 ఆగస్టు 23న విజయవంతంగా ల్యాండ్ అవడంతో జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి.



అద్భుత విజయం



చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రునిపైకి చేర్చిన నాలుగో దేశంగా నిలవడం భారతీయునిగా గర్వంగా ఉంది. ఇలాంటి ప్రయోగాలు విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని కల్గిస్తాయి. పరిశోధన చేయాలన్న ఆసక్తి వారిలోనూ కలుగుతుంది. భారత త్రివర్ణ పతాకాన్ని చంద్రునిపై రెపరెపలాడించిన ఇస్రో శాస్త్రవేతలకు అభినందనలు.

– దేవయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ సిరిసిల్ల

గర్విస్తున్నాం



చంద్రయాన్–3 సక్సెస్‌తో భారతీయులుగా గర్వపడుతున్నాం. చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ సేఫ్‌గా ల్యాండ్ అయిన సమయంలో ఎంతో గర్వంగా అనిపించింది. ఇలాంటివి చూడడం వల్ల ప్రయోగాలు చేయాలనిపిస్తుంది.

– జి.శ్రీవాణి, పదోతరగతి, కేజీబీవీ

ఆసక్తిగా తిలకించాం



చంద్రయాన్–3 ల్యాండింగ్‌ను టీవీలో ఆసక్తిగా తిలకించాం. చెప్పిన సమయానికి అక్కడ చేరడం శాస్త్రవేత్తల పరిశీలన, వారి శ్రమ నాకు తెలిసింది. ఇలాంటి పరిశోధన సంస్థలో చేరాలని నేను, మా ఫ్రెండ్స్ అనుకుంటున్నాం. నిజంగా చంద్రుని మీదకు వెళ్లగలిగే సమయం వస్తే చాలా సంతోషం.

– అతికం శ్రీనిధి, సిరిసిల్ల

ప్రయోగాలు ఉత్తేజాన్ని నింపుతాయి



సైన్స్ ప్రయోగాల గురించి విద్యార్థులు తెలుసుకోవడం వారితో నూతన ఉత్తేజాన్ని నింపుతాయి. అంతేకాకుండా సైన్స్‌పై అవగాహన కలుగుతుంది. కేజీబీవీలో చంద్రయాణ్–3 ల్యాండింగ్‌ను లైవ్ ఏర్పాటు చేశాం.

– పావని, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ

న్యూస్‌రీల్

మానసిక ప్రశాంతతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్లటౌన్: మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో బుధవారం గర్భం, ప్రసవానంతర సమయంలో ఆందోళనకు గురయ్యే స్త్రీలకు కల్పించాల్సిన మానసిక ఆరోగ్యంపై సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. వైద్యులు దివ్యశ్రీ, వేణుమాధవ్, మహేశ్, సీహెచ్‌వో శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌వోలే కీలకం



మాట్లాడుతున్న సిరిసిల్ల ఆర్డీవో

గంభీరావుపేట(సిరిసిల్ల): ఓటరు జాబితాను రూపకల్పనలో బీఎల్‌వోలదే కీలకపాత్ర అని సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల పరిషత్‌లో బుధవారం బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ప్రతి బీఎల్‌వో తమ పరిధిలోని పోలింగ్‌స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. పోలింగ్‌స్టేషన్లలో వసతులు తనిఖీ చేయాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో శ్రీనివాస్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సంఘీభావం తెలుపుతున్న కటకం మృత్యుంజయం

సిరిసిల్లఅర్బన్: రెండో ఏఎస్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు కటకం మృత్యుంజయం కోరారు. రెండో ఏఎస్‌ఎంలు చేపడుతున్న నిరాహారదీక్షకు బుధవారం మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, నాయకుల గరిపెల్లి ప్రభాకర్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

మిడ్‌మానేరుకు వరద



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టుకు వరద ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రాజెక్టులోకి 7,030 క్యూసెక్కుల మేర వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా ఎల్‌ఎండీకి 5,180 క్యూసెక్కుల నీరు వదిలిపెట్టారు. ప్రస్తుతం 20.24 టీఎంసీలకు నీరు చేరింది.

108 రోజుల ‘అసెంబ్లీ’ ఆట

- ఎన్నికల వేళ అన్ని పార్టీల అభ్యర్థుల ముందు ఖర్చుల కొండ
- ఇక నుంచి ప్రతీ పండుగ బాధ్యత వారిదే..
- ‘కోడ్’ వచ్చేలోగా రూ.2, 3 కోట్లకుపైగా వదులుకోవాల్సిందే..
- ఓటర్లు, కార్యకర్తలు, నాయకులకు మొదలైన మర్యాదలు
- కేడర్ సహకారం, వెన్నుపోట్లపై భయాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: 108.. ఇది ఎమర్జెన్సీ అంబులెన్స్ నంబర్ కాదు.. అదేదో వ్రతం కోసం గుడి చుట్టూ చేసే ప్రదక్షిణలు కావు.. వచ్చే డిసెంబర్‌లో జరిగే ఎన్నికలకు కాస్త అటూ ఇటుగా ఉన్న రోజులు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకుంటున్న అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు తమ కళ్ల ముందు మెదులుతున్న ఖర్చుల కొండను తలుచుకొని, బెంబేలెత్తుతున్నారు. అధికార బీఆర్ఎస్ ఎన్నికలకు సమరశంఖం పూరించడం, మరోవైపు మిగిలిన పార్టీల్లోనూ ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. కానీ ఎన్నికల్లో రానూరాను ఖర్చులు పెరుగుతుండటం అభ్యర్థులను కలవరపెడుతోంది. నామినేషన్, ప్రచారం, పోలింగ్ ఇవన్నీ ఒక ఎత్తయితే, దానికి ముందే ఎన్నికల వాతావరణం రావడంతో ఇటు కేడర్‌ను, అటు ప్రజలను ఆకట్టుకునేందుకు నేతలు రూ.లక్షలు కుమ్మరించాల్సిన పరిస్థితి. ఓటర్లు మొదలుకొని కార్యకర్త, నాయకుల వరకు ఇప్పటికే మర్యాదలు మొదలయ్యాయి.

వెళ్లాల్సిందే.. కట్నాలు చదివించాల్సిందే

ప్రతీ నియోజకవర్గంలో అన్ని రకాల కులాలు, మతాల ఓటర్లు ఉంటారు. మహిళలు, వృద్ధులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, దివ్యాంగులు, వితంతువులు.. ఇలా అన్ని వర్గాల వారిని ఆకట్టుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే ఆశావహులదే. ఇందుకు అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష నాయకుల వరకు ఎవరూ అతీతులు కారు. దీంతో ఇకపై నియోజకవర్గంలో జరిగే ప్రతీ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చావు, పుట్టుక, పుట్టిన రోజు, పెళ్లి రోజు, సారీ ఫంక్షన్, సంతాప సభ, సన్మానాలు, కుల సంఘాల సమావేశం, ఆత్మీయ సమ్మేళనాలు, ఉద్యోగ విరమణల నుంచి గృహ ప్రవేశాల వరకూ వెళ్లాల్సిందే.. కట్నకానుకలు చదివించాల్సిందే.

దజన్‌కు పైగా పండుగలు

ఆగస్టు 25న వరలక్ష్మి వ్రతం, 31న రాఖీ, సెప్టెంబర్ 6న కృష్ణాష్టమి, 18న వినాయక చవితి, 28న వినాయక నిమజ్జనం/మిలాద్–ఉన్–నబీ, అక్టోబర్ 2న గాంధీ జయంతి, 23న బతుకమ్మ, 24న దసరా, నవంబర్ 13న దీపావళి, 14న బాలల దినోత్స వం, 27న కార్తీకపౌర్ణమి.. ఇలా ఎన్నికలు ముగిసే లోగా.. డజన్‌కు పైగా పండుగలను ప్రజలు గుర్తుంచుకునేలా జరిపే బాధ్యత అభ్యర్థులు, ఆశావహులదే.

ఆస్తులు అమ్ముకునేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారైనా ఎమ్మెల్యే కావాలనుకునే వారు, ఈసారి కాకుంటే ఇంకెప్పటికీ కాలేమన్న ఆలోచనలో ఉన్నవారు ఈసారి సర్వశక్తులు ఒడ్డేందుకు ముందుకు వస్తున్నారు. చివరికి పార్టీలో, నలుగురిలో తాము ధనవంతులమే అని చాటుకునేందుకు తమ ఆస్తులు అమ్మేందుకు, మరికొందరు కుదవపెట్టేందుకు సంసిద్ధులుగా ఉన్నారు. ఈ రోజుల్లో నాయకుడు బయటికి వచ్చాడంటే.. కనీసం నాలుగైదు కార్ల కాన్వాయ్ తప్పనిసరి. వాటిలో పెట్రోలు కొట్టించాలి. ప్రతీ కారులో ఐదారుగురు అనుచరులు, కాన్వాయ్ రాగానే జిందాబాద్‌లు కొట్టేందుకు కొందరు యువత, బైక్‌ల వెంట జెండాలు పట్టుకొని తిరిగే కార్యకర్తలు, మంగళహారతులు ఇచ్చేందుకు మహిళలు ఉండాలి. ప్రతీ నాయకుడు కనీసం 100 మందికి ఈ మూడు నెలలపాటు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వేతనాలు ఇవ్వాల్సిన పరిస్థితి. ప్రతిరోజూ వారి వాహనాల్లో పెట్రోలు కొట్టించడం, భోజనాలు, చేతి ఖర్చులు, రాత్రిపూట రాచమర్యాదలు సరే సరి. ప్రతీ నాయకుడు ఎంత లేదన్నా రూ.2, 3 కోట్లకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది.

‘కోడ్’ కూశాక అసలు ఆట

ఈ 108 రోజుల్లో కేడర్‌ను చూసుకునేందుకు రోజుకు రూ.లక్ష అయినా ఖర్చవుతుంది. ఇక దసరాకు కాస్త అటూఇటుగా ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలున్నాయి. అధికార పార్టీకి అంతోఇంతో పార్టీ నుంచి, వివిధ వర్గాల నుంచి ఆర్థిక సహకారం లభిస్తుంది. కానీ, ప్రతిపక్షాలకు ఆ అవకాశాలు చాలా తక్కువ. పోస్టర్లు, ప్రచారం, సభలు, సమావేశాలు, యాడ్స్, ఫ్లెక్సీలు, ఇంటింటి ప్రచారాలు, పాదయాత్రలు అంటూ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆశావహుల జేబులకు చిల్లులు పడేది ఈ సమయంలోనే. అటు తర్వాత చేసే ఖర్చు లెక్కలను ఎన్నికల సంఘానికి చెప్పాల్సి ఉంటుంది. బయటకు కనబడకుండా ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకునేందుకు పరిమితికి మించి ఖర్చు చేయాలి. అదే సమయంలో పక్కనే ఉంటూ వైరిపక్షాలకు సాయపడే వెన్నుపోటుదారులను తలచుకొని, నేతలు గుబులు పడుతున్నారు.

ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్



వివరిస్తున్న అధికారులు

సిరిసిల్ల: ఎన్నికల విధులను బాధ్యతగా, పారదర్శకంగా నిర్వహించాలని.. ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఈవీఎం, వీవీ ప్యాట్లపై సెక్టోరియల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్ల నిర్వహణపై, వాటి పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈవీఎం నిర్వహణపై మాస్టర్ ట్రెయినర్ పాతూరి మహేందర్‌రెడ్డి వివరించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్ కుమార్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, మాస్టర్ ట్రెయినర్లు మహేందర్‌రెడ్డి, శ్రీధర్, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేశ్‌కుమార్, మొహినొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య



వినతిపత్రం అందిస్తున్న దేశాయిపల్లి వాసులు

బోయినపల్లి(చొప్పదండి): సకాలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నిజామాబాద్ సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య తెలిపారు. బోయినపల్లిలోని రైతువేదిక భవనంలో వేములవాడ సబ్‌డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం బుధవారం నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ అధ్యక్షుడు సంపత్‌రావు విద్యుత్ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దేశాయిపల్లి ఒర్రె పరిసరాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేరే చోటుకు మార్చాలని గ్రామ సెస్ ప్రతినిధి ఎమిరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. వివిధ సమస్యలపై 23 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. టెక్నికల్ సభ్యుడు బుస్స అశోక్, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఫైనాన్స్ మెంబర్ ఎల్.కిషన్, సెస్ ఏఈ ప్రశాంత్ ఉన్నారు.

‘సెస్’ మేనేజింగ్ డైరెక్టర్‌గా సూర్యచంద్రరావు

- ఎన్‌పీడీసీఎల్ సీఈగా మాతృసంస్థకు రామకృష్ణ

సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎస్.సూర్యచంద్రరావును నియమిస్తూ వ్యవసాయ, సహకారశాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు ఆదేశాలు జారీచేశారు. హైదరాబాద్ సహకారశాఖలో జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.సూర్యచంద్రరావును ‘సెస్’ ఎండీగా నియమిస్తూ జీవోఆర్‌టీ నంబరు 371 తేదీ 22.08.2023 జారీ అయింది. 2019 నుంచి సిరిసిల్లలో ‘సెస్’ ఎండీగా పనిచేస్తున్న ఎస్.రామకృష్ణ మాతృసంస్థ అయిన ఎన్‌పీడీసీఎల్‌కు వెళ్లనున్నారు. ఎన్‌పీడీసీఎల్‌లో ఆయన చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై ‘సెస్’ ఎండీగా పనిచేశారు. ఆయన స్థానంలో సహకారశాఖ జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సూర్యచంద్రరావును నియమించారు. ఆయన 2025 నవంబరు 30న రిటైర్డు అవుతారు. గతంలోనూ సహకారశాఖ అధికారులు ‘సెస్’ ఎండీలుగా పనిచేశారు. జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలు అందించే ‘సెస్’ సంస్థకు ఇటీవల కొత్త పాలకవర్గం ఎన్నికవగా.. కొత్త ఎండీగా సూర్యాచంద్రరావు నియమితులయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించాలి



పెన్షన్ పెంపు పత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



వేములవాడలో హాజరైన దివ్యాంగులు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసీడింగ్‌లు పంపిణీ

సిరిసిల్ల: దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతికేలా తెలంగాణ ప్రభుత్వం ఆసరా పెన్షన్లను రూ.4,016 ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసిడింగ్‌లు, బీడీ కంపెనీల టేకేదార్లకు ఆసరా పెన్షన్ల మంజూరుపత్రాలను పంపిణీ చేశారు. అరుణ మాట్లాడుతూ సబ్బండవర్గాల అభివృద్ధి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీడీ కంపెనీ టేకేదార్లు అడుగకపోయినా సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో ఆసరా పెన్షన్లు మంజూరు చేశారన్నారు. తెలంగాణ రాక ముందు రూ.500 ఉన్న పెన్షన్ ఇప్పుడు రూ.4,016 చేరడం ప్రభుత్వానికి ఉన్న మానవీయ కోణమే కారణమన్నారు. ఆడపిల్లల పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో రూ.లక్ష సాయం, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వడం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు నిదర్శనమన్నారు. జిల్లాలోని 11,968 మంది దివ్యాంగులకు, 386 మంది బీడీ కంపెనీల టేకేదార్లకు పెన్షన్లు అందిస్తున్నట్లు వివరించారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీలు పిల్లి రేణుక, పడిగెల మానస, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, డీఆర్‌డీఏ ఏపీవో అయినేని పాపారావు, బీఆర్ఎస్ నాయకులు అందె సుభాష్, కృష్ణారెడ్డి, బీడీకార్మిక సంఘం నాయకులు వెంగళ శ్రీనివాస్, బీడీ కంపెనీ టేకేదార్ అడ్డగట్ల మురళి పాల్గొన్నారు.

గౌరవంగా తలెత్తుకొని బతకాలని

వేములవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. వేములవాడఅర్బన్ మండల పరిషత్‌లో బుధవారం వేములవాడ నియోజకవర్గంలోని దివ్యాంగులు, టేకేదారులకు పింఛన్ మంజూరుపత్రాలను అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ గతంలో దివ్యాంగులను పట్టించుకున్న ప్రభుత్వాలు లేవన్నారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కులాలకు, మతాలకు అతీతంగా ఎన్నో పథకాలు తీసుకొచ్చారన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎంపీపీలు బూర వజ్రమ్మ, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, జెడ్పీటీసీలు మ్యాకల రవి, ఏశ వాణి, నాగం కుమార్, గట్ల మీనయ్య, పెన్షన్ ఏపీవో పాపారావు, ఎంపీడీవోలు శంకర్, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

ఆసాముల వంటా వార్పు

- పింజర్ల డబ్బుల కోసం పోరుబాట
- నేడు సిరిసిల్లలో ర్యాలీ



సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ముందు ఆసాముల వంటా వార్పుతో నిరసన

సిరిసిల్ల: పింజర్ల డబ్బులు ఇవ్వాలని కోరుతూ సిరిసిల్లలో బుధవారం ఆసాములు వంటావార్పుతో నిరసన తెలిపారు. 2021 నాటి పింజర్ల డబ్బులు సగం ఇచ్చిన చేనేత, జౌళిశాఖ మరో సగం డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తుందని ఆరోపిస్తూ ఆసాములు ఆందోళనబాట పట్టారు. ఇప్పటికే రెండు రోజులుగా నిరసన దీక్షలు చేసిన ఆసాములు బుధవారం పాలిస్టర్ అసోసియేషన్ ఆఫీస్ ముందు వంటావార్పు చేపట్టారు. ఏప్రిల్‌లో యజమానులు సమావేశమై నెల రోజుల్లో ప్రభుత్వం ద్వారా పింజర్ల డబ్బులు రాకుంటే తామే చెల్లిస్తామని టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ సమక్షంలో రాతపూర్వకంగా ఒప్పందం చేశారని ఆసాములు తెలిపారు. ప్రభుత్వం ఇవ్వక.. యజమానులు భరించకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీఐటీయూ నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ఆసాముల ప్రతినిధులు సిరిసిల్ల రవీందర్, చేరాల అశోక్, మండల రాజు, రాజేశం, శ్రీనివాస్, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

పింజర్ల డబ్బుల కోసం గురువారం సిరిసిల్లలో ఆసాములు ర్యాలీ నిర్వహించనున్నారు. పాలిస్టర్ అసోసియేషన్ ఆఫీస్ నుంచి పాత బస్టాండులోని నేతన్న విగ్రహం వరకు ర్యాలీ తీయాలని నిర్ణయించారు.

దంచికొట్టిన వాన



బోయినపల్లి–స్తంభంపల్లి మధ్య గంజివాగుపై..



బోయినపల్లి–వేములవాడ మధ్య కల్వర్టుపై వరద

- బోయినపల్లిలో 92.0 మిల్లీ మీటర్లు
- ఇల్లంతకుంటలో 1.8 మిల్లీ మీటర్లు

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం తెల్లవారుజామున వాన దంచికొట్టింది. బోయినపల్లి మండలంలో అత్యధికంగా 92 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బోయినపల్లి–వేములవాడ మార్గంలో కల్వర్టు వద్ద వరద నీటి ఉధృతి కొనసాగింది. రుద్రంగిలో 12.5 మిల్లీమీటర్లు, చందుర్తిలో 14.5, వేములవాడ రూరల్‌లో 29.6, వేములవాడలో 75.9, సిరిసిల్లలో 49.6, కోనరావుపేటలోనూ 49.6, వీర్నపల్లిలో 48.0, ఎల్లారెడ్డిపేటలో 17.6, గంభీరావుపేటలో 17.3, ముస్తాబాద్‌లో 5.4, తంగళ్లపల్లిలో 5.8, ఇల్లంతకుంటలో అత్యల్పంగా 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గతేడాది ఈ రోజు వరకు జిల్లాలో 861.4 మిల్లీమీటర్ల వర్షం కురువగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 760.0 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 516 ఉంది.

కల్వర్టులపై వరద ప్రవాహం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల కేంద్రం శివారులో రెండు లోలెవల్ కల్వర్టులపై నుంచి, స్తంభంపల్లి గంజివాగు కల్వర్టు వద్ద వరద ఉధృతి పెరిగింది. బోయినపల్లి నుంచి వేములవాడకు, కొదురుపాకకు రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి.

వెంటాడిన పౌరసత్వ వివాదం

- 'ఆది' నుంచి అదే పోరు
- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం
- రమేశ్‌బాబు రాజకీయ భవిష్యత్‌పై చర్చ

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును 'ఆది' నుంచి పౌరసత్వం సమస్య వెంటాడుతూనే ఉంది. కోర్టుల్లో పోరాడుతూనే 2009 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ టికెట్లు కేటాయించే అంశంపై పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌సైతం మొట్టమొదటగా రమేశ్‌బాబు పౌరసత్వం అంశాన్ని మాట్లాడుతూ టికెట్టు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. పౌరసత్వం కేసు కోర్టులో ఉన్నందునే వేములవాడలో అభ్యర్థిని మార్చాల్సి వస్తోందని ప్రకటించారు. బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు నియోజకవర్గంలో చురుకుగా పర్యటిస్తుండగా.. రమేశ్‌బాబు అనుచరులు మాత్రం ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నారు.

పౌరసత్వం కేసు ఇదీ..

వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పౌరసత్వాన్ని సవాల్ చేస్తూ రాజకీయ ప్రత్యర్థి ఆది శ్రీనివాస్ 2009 జూన్‌లో కేంద్ర హోంశాఖలో ఫిర్యాదు చేశారు. ఏడాది కాలంపాటు దేశంలో లేడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన కేంద్ర హోంశాఖ అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్పీని విచారణకు ఆదేశించింది. రమేశ్‌బాబు 96 రోజులు మాత్రమే భారతదేశంలో ఉన్నట్లు నివేదికను సమర్పించారు. 2010 ఉపఎన్నికల తర్వాత రమేశ్‌బాబు ఎన్నికను సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆది శ్రీనివాస్ ఆశ్రయించారు. దీంతో 2013 ఆగస్టు 14న రమేశ్‌బాబు పౌరసత్వం రద్దు చేయడమే కాకుండా ఓటర్ జాబితాలో పేరు తొలగించాలని తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ రమేశ్‌బాబు 2013లో సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా.. కోర్టు స్టే ఇచ్చింది. రమేశ్‌బాబుకు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని ఆది శ్రీనివాస్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ వాదనలు కొనసాగుతున్న క్రమంలో ఈ అంశాన్ని కేంద్ర హోంశాఖ తేల్చాలని రమేశ్‌బాబు తరపు



2010లో టీడీపీ నుంచి గెలిచి, తెలంగాణ కోసం రాజీనామా చేశాక ఉద్యమంలో రమేశ్‌బాబు

న్యాయవాది వాదనలు వినిపించారు. దీంతో ఈ అంశం కేంద్ర హోంశాఖకు వెళ్లింది. రమేశ్‌బాబు విజ్ఞప్తితో కేంద్రహోంశాఖ త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. త్రీమెన్ కమిటీ సైతం రమేశ్‌బాబు మోసపూరితంగా పౌరసత్వం పొందారని తేల్చి చెబుతూ.. ఆగస్టు 31, 2017న పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ అంశాన్ని రివ్యూ చేయాలని మరోసారి కేంద్రహోంశాఖకు రమేశ్‌బాబు విజ్ఞప్తి చేయగా.. జర్మనీ పౌరసత్వం ఉందంటూ డిసెంబర్ 17, 2017న భారతదేశ పౌరసత్వం రద్దు చేసింది. దీనిపై రమేశ్‌బాబు జనవరి 5, 2018న హైకోర్టును ఆశ్రయించగా.. స్టే లభించింది. స్టేను ఎత్తివేయాలని కోరుతూ ఆది శ్రీనివాస్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈక్రమంలో హైకోర్టు జూలై 10, 2019న రమేశ్‌బాబు పౌరసత్వాన్ని కేంద్రహోంశాఖ మూడు నెలల్లో తేల్చాలని ఆదేశించింది. కేంద్రహోంశాఖ రమేశ్‌బాబు పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటి నుంచి కేసు కొనసాగుతోంది. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో రెండు, మూడు నెలల్లో తీర్పు వస్తుందన్న అంచనాతో బీఆర్‌ఎస్ పార్టీ అధినేత టికెట్ చల్మెడ లక్ష్మీనరసింహారావుకు కేటాయించినట్లు ప్రకటించారు.

నాలుగుసార్లు గెలుపు

రమేశ్‌బాబు 2009 ఎన్నికల్లో టీడీపీ టికెట్‌పై వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచారు. 2010 ఉప ఎన్నికల సందర్భంగా టీడీపీకి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరి ఆపార్టీ టికెట్‌పై గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచారు.

పార్టీ మారుతున్నాననే ప్రచారం అవాస్తవం

నేను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవం. అవన్నీ తప్పుడు వార్తలు. త్వరలోనే వేములవాడకు వచ్చి.. నా అనుచరులు, అభిమానులు, మద్దతుదారులతో సమీక్షించిన తర్వాత భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తా.

– రమేశ్‌బాబు, వేములవాడ ఎమ్మెల్యే

భావోద్వేగ ప్రకటన

టిక్కెట్టు రాలేదని తెలిసిన తర్వాత ఎమ్మెల్యే రమేశ్‌బాబు భావోద్వేగ ప్రకటన చేశారు. 'సవాళ్లు వచ్చినప్పుడే ధీటుగా నిలబడాలి. ఎన్నికల కోసం అభ్యర్థులు వెనువెంటనే పుట్టరు. ప్రజాసేవ ద్వారా ఈ అర్హతలు సంపాదించుకోవాలి. పౌరసత్వంపై అక్టోబర్‌లో మనకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆ సమస్య తీరితే మనకు ఆటంకాలు ఉండవు. ఉత్తమంగా పనిచేశానన్న సీఎం గారి వ్యాఖ్యలే మన దశాబ్దకాలం నిస్వార్థ ప్రజాసేవకు నిదర్శనం.' అంటూ భావోద్వేగంతో కూడిన పోస్టు చేశారు.

క్లుప్తంగా

కల్వర్టుపై దిగబడ్డ బండరాళ్ల ట్రాక్టర్



బోయినపల్లి(చొప్పదండి): కల్వర్టుపై బుధవారం ఓ బండరాళ్ల ట్రాక్టర్ దిగబడింది. బండరాళ్లు కింద పడిపోయి, ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట నుంచి బోయినపల్లి మీదుగా వేములవాడరూరల్ మండలం వట్టెంలకు బండరాళ్లను తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోయినపల్లి పరిసరాల్లోని కల్వర్టుపై ఒక్కసారిగా దిగబడింది. గత నెల 27న కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కోతకు గురైంది. తాత్కాలికంగా మట్టి పోసి రాకపోకలు పునరుద్ధరించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురవడంతో ట్రాక్టర్ దిగబడిందని స్థానికులు తెలిపారు. బండరాళ్లను కూలీలతో తీయించి, కల్వర్టు కుంగిన చోట జేసీబీ సహాయంతో మట్టిని నింపినట్లు పేర్కొన్నారు. వట్టెంలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ఇంజిన్ వద్ద కూర్చోవడంతో డ్రైవర్‌తో పాటు వారికి ప్రాణాపాయం తప్పిందన్నారు. ఒకవేళ ఇద్దరూ బండరాళ్లపై కూర్చొని ఉంటే చనిపోయేవారని తెలిపారు. శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ఇక్కడ ఏటా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



బాలకుమార్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన బండారి బాలకుమార్(35) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి, నిద్రపోయాడు. బుధవారం ఉదయం అతని భార్య లావణ్య లేచి చూసేసరికి పక్క గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురుకు ఫిట్స్ ఉండటం, రూ.4 లక్షల వరకు అప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సమావేశమైన 'ఏనుగు' వర్గం

- రాజకీయ పరిణామాలపై చర్చ



సమావేశమైన నాయకులు

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్‌లో రాజకీయాలు తారస్థాయికి చేరుతున్నాయి. పార్టీ టికెట్ ఆశించిన ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం తన అనుచరులు, అభిమానులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నట్లు సమాచారం. వేములవాడకు చెందిన పలువురు కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. మంత్రి కేటీఆర్‌ను కలుసుకున్న తర్వాత తమ నిర్ణయం ప్రకటించాలని చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఏనుగు మనోహర్‌రెడ్డికి ఐదేళ్లుగా పార్టీలో గుర్తింపు దక్కలేదని.. నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించలేదని చర్చ సాగినట్లు తెలిసింది. ఎమ్మెల్యే టిక్కెట్ల వ్యవహారం తేలిపోవడంతో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచన చేసినట్లు సమాచారం.

హామీలు నెరవేర్చండి

- ఎమ్మెల్యే ఇంటి ముందు బీజేపీ నాయకుల బైఠాయింపు

వేములవాడ: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఇంటి ముందు బైఠాయించారు. అంతకుముందు మల్లారం జంక్షన్ నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. తుల ఉమ మాట్లాడుతూ గత ఎన్నికల హామీలను నెరవేర్చకుండానే.. మళ్లీ అవే హామీలు వల్లెవేస్తూ ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, అర్హులకు దళితబంధు, అర్జీ పెట్టుకున్న ప్రతీ బీసీకి బీసీబంధు, గృహలక్ష్మి పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఒకే దఫాలో డబ్బు



ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించిన నాయకులు

లు అందించాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణశాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆశీర్వదిస్తే పోటీ చేస్తా

- కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీర్వదిస్తే సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి ఎన్నికల ప్రచార క్యాంపెయిన్ సభ్యుడిగా తనకు అవకాశం కల్పించిన కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. గతంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకుడిగా, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశానని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పోటీ



మాట్లాడుతున్న శ్రీనివాస్

చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, నాయకులు వెంగళ అశోక్, చొప్పదండి ప్రకాశ్, సతీశ్‌రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై, ఏఎస్సై అభ్యర్థులకు వైద్య పరీక్షలు

- రాజన్న జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీసుశాఖలోని వివిధ విభాగాల్లో (సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్) ఎస్సై / ఏఎస్‌ఐ(ఫింగర్ ప్రింట్ బ్యూరో, కమ్యూనికేషన్) నియామకాలకు అర్హత సాధించిన జోన్–ఐఐఐ అభ్యర్థులకు ఈనెల 26 నుంచి 28వరకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జోన్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఈఐఏ)



కె.రమేశ్ నాయుడు

కె.రమేశ్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వైద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. జోన్ నుంచి ఎంపికైన 45మంది అభ్యర్థులు వైద్యపరీక్షల నిమిత్తం ఈనెల 25న సాయంత్రం ఐదుగంటలకు కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని సీఏఆర్ ఏసీపీ/ఆర్‌ఐ అడ్మిన్ ఎదుట హాజరుకావాలని పేర్కొన్నారు.

గిరిజన మహిళకు న్యాయం చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గిరిజన మహిళపై దౌర్జన్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే.గౌస్, మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం పార్టీ నాయకులతో కలిసి, ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఇంట్లో జరిగే వివాహానికి రూ.3 లక్షలు, పెళ్లి పత్రిక



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తీసుకొని వెళ్తున్న ఆమెను పోలీసులు అడ్డుకొని, అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేయడం అన్యాయమన్నారు. హైకోర్టు స్పందించి, ఆ మహిళను కొట్టిన పోలీసులపై తక్షణమే చర్య తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, రాజునాయక్, బాబు, బుచ్చాగౌడ్, మహేందర్, రాజు, శ్రీనివాస్, బాలయ్య, తిరుపతిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్లఅర్బన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశావర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. ప్రభుత్వం ఆశావర్కర్లపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా స్పందించి రూ.18వేల వేతనం చెల్లించాలని కోరారు. ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి సుశీల, భారతక్క, లత, సునంద, తార ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలు విస్తరించాలి



వివరాలు తెలుసుకుంటున్న లక్ష్మీరాజం

రుద్రంగి(వేములవాడ): అంగన్‌వాడీ సేవలను మరింత విస్తరించాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. రుద్రంగిలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ మమతను అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పోషక పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు ప్రభుత్వమే పోషకపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఏసీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ మమత తదితరులు ఉన్నారు.

ఎంఈవోపై కేసు నమోదు చేయండి

- డీఈవోకు ఫిర్యాదు చేసిన ఏబీవీపీ నాయకులు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల విద్యాధికారి దూస రఘుపతిపై కేసు నమోదు చేసి, స్థానిక ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుదవారం డీఈవో రమేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ తంగళ్లపల్లిలో గతంలో మూసివేసిన ఓ ప్రైవేటు పాఠశాల రికార్డులు ఎంఈవో దగ్గర ఉండాల్సి ఉండగా.. మరో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం వద్ద ఉన్నాయన్నారు. మూసివేసిన స్కూల్ పేరుతో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు స్కూల్‌కు కొమ్ముకాస్తున్న ఎంఈవో రఘుపతిపై కేసు నమోదు చేసి, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ వింగ్ ఎస్‌ఎఫ్‌డీ విభాగ్ కన్వీనర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బుధవారం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంతకుముందు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ మాట్లాడుతూ న్యాయ సేవా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజం, న్యాయవాదులు పెంట



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ

శ్రీనివాస్, ఆడెపు వేణు, జ్యోతి, కళ్యాణి, గుర్రం ఆంజనేయులు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

నాయకులు వస్తారు.. పోతారు

- కార్యకర్తలే బీజేపీ బలం
- బెంగళూరు రూరల్ ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఏ పార్టీలోకైనా నాయకులు వస్తారు.. పోతారు.. కానీ కార్యకర్తలే బీజేపీకి బలమని బెంగళూరు రూరల్ ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ అన్నారు. ముస్తాబాద్‌లోని ఓ గార్డెన్స్‌లో బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలు బాగా పనిచేస్తే 70 శాతం ఓట్లు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

బీజేపీని బలోపేతం చేయండి

సిరిసిల్లఅర్బన్: బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని బెంగళూరు రూరల్ ఎమ్మెల్యే ధీజ్ మునిరాజ్ కోరారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన ఎమ్మెల్యే ప్రవాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్

అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణంలోని 84 బూత్‌లలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లగిశెట్టి శ్రీనివాస్, ఆవునూరి రమాకాంత్‌రావు, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, కరీంనగర్ పార్లమెంటరీ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, కార్యదర్శి సంజీవ్, మహిళా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు మహేందర్, కౌన్సిలర్ బొల్గం నాగరాజు, దళితా మోర్చా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- అస్సాంలోని పాలాష్‌బరి ఎమ్మెల్యే హేమంగ్ టకూరియా

కోనరావుపేట(వేములవాడ): తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అస్సాంలోని పాలాష్‌బరి నియోజకవర్గ ఎమ్మెల్యే హేమంగ్ టకూరియా అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మరోసారి మోదీని ప్రధాని చేయడం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హేమంగ్ టకూరియా

రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, జిల్లా కార్యదర్శులు మార్త సత్తయ్య, మల్లికార్జున్, సురేందర్‌రావు, బీజేవైఎం నాయకుడు బాలాజీ, ఓబీసీ మోర్చా నాయకులు ప్రభాకర్, మోహన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో నిరసనల హోరు



వంటావార్పు చేస్తున్న ఆసాములు



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు



నిరాహార దీక్ష చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం బుధవారం నిరసనలు, నినాదాలతో హోరెత్తింది. పింఛన్ల డబ్బులు చెల్లించాలని పాలిస్టర్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద రెండో ఏఎన్ఎంలు మోకాళ్లపై నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్‌లు నిరాహార దీక్ష చేశారు.

పింజర్ల డబ్బులు చెల్లించాలి

పింజర్ల డబ్బులు చెల్లించాలని సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఆసాములు బుధవారం వంటావార్పు చేపట్టారు. 2021 సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ డబ్బులు ఇస్తామని చెప్పి, యజమానులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. చెల్లించకపోతే నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఆసాములు రవీందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై ఏఎన్ఎంల నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్ఎంలు మోకాళ్లపై నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లు సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలు పరిష్కరించాలంటూ సిరిసిల్ల అంబేడ్కర్ చౌక్ వద్ద మాజీ సర్పంచ్‌లు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం 15వ రోజు కొనసాగింది. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బొడ్డు దేవయ్య, బుర్ర మల్లేశంగౌడ్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వప్నికకు ఘన స్వాగతం

ధర్మపురి: అంతర్జాతీయ వేదికపై పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన రంగు విరంచి స్వప్నిక బుధవారం పట్టణానికి చేరుకున్నారు. ఈసందర్భంగా పట్టణవాసులు, అభిమానులు, క్రీడాకారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. పట్టణానికి చెందిన రంగు వెంకటరమణ – శ్రీలత దంపతుల కూతురు విరంచి స్వప్నిక ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు షార్జా(దుబాయి)లో జరిగిన ఆసియా యూనివర్సిటీ స్థాయి కప్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. వాటితో స్వస్థలానికి చేరుకున్న స్వప్నికకు యువకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వప్నికకు ప్రశంసం జల్లు కురిపించారు. పూలమాల, శాలువాతో సన్మానించారు. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు, కోచ్ రాజేందర్‌ను వారు అభినందించారు.



స్వప్నికకు స్వాగతం పలుకుతున్న పట్టణవాసులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788623]

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189136]

WANTED

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ : 9640258899, 9640468899 [HA-189323]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-12052]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824